# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 19-05-2026** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ఉమ్మడి సంప్రదాయాలు, నదులు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర రాష్ట్రాలను అనుసంధానించాయని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు.**

2. **ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో నిర్వహించే 'మత్స్యకారుల సేవలో' ఈ రోజు పాల్గొంటారు.**

3. **అధికారులు అంకితభావంతో ప్రజలకు సేవలు అందించాలని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా సూచించారు.**

4. **రాష్ట్రంలోని 36 నీటిపారుదల ప్రాజెక్టులను పూర్తిచేసేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించామని ఆంధ్రప్రదేశ్ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.**

==========================

"ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ కార్యక్రమంలో" భాగంగా నిర్వహిస్తున్న 'యువ సంగం' కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గవర్నర్ జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్ నిన్న పాల్గొన్నారు. విజయవాడలోని లోక్ భవన్ దర్బార్ హాల్‌లో మహారాష్ట్రకు చెందిన విద్యార్థులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ పర్యటనకు వచ్చిన మహారాష్ట్ర విద్యార్థులను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించారు. ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర రాష్ట్రాలకు శతాబ్దాల చారిత్రక అనుబంధం ఉందని ఆయన పేర్కొన్నారు. ఉమ్మడి సంప్రదాయాలు, నదులు, వాణిజ్య మార్గాలు రెండు రాష్ట్రాల ప్రజలను అనుసంధానించాయని తెలిపారు. దేశంలో పెట్టుబడి గమ్యస్థానాల్లో ఆంధ్రప్రదేశ్ ఒకటిగా నిలుస్తోందని గవర్నర్ పేర్కొంటూ,

వాయిస్..25.. సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలి నియోజకవర్గంలో ఈ రోజు పర్యటిస్తారు. జిల్లాలోని కావలి మండలం తుమ్మలపెంట గ్రామంలో నిర్వహించే 'మత్స్యకారుల సేవలో' ఆయన పాల్గొని ... మత్స్యకార కుటుంబాలకు ఆర్థిక సాయం విడుదల చేయనున్నారు. అమరావతి నుంచి తుమ్మలపెంటకు చేరుకుని ముఖ్యమంత్రి ముందుగా లబ్దిదారుల కుటుంబాలతో సమావేశమవుతారు. అనంతరం ప్రజావేదికలో నిర్వహించే సభలో.. పాల్గొని మత్స్యకారులను ఉద్దేశించి

ప్రసంగిస్తారు. 'మత్స్యకారుల సేవలో' పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా లక్షా 30 వేల 796 మత్స్యకార కుటుంబాలకు మొత్తం 262 కోట్ల రూపాయల ఆర్థిక సాయం ప్రభుత్వం విడుదల చేయనుంది. ఈ మేరకు ముఖ్యమంత్రి పర్యటనకు జిల్లా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

--------------------------

సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. అమరావతి రాష్ట్ర సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి జిల్లాల కలెక్టర్లు, అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బందితో నిన్న దృశ్యమాధ్యమ విధానంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలో సుపరిపాలనకు ఆంధ్రప్రదేశ్ జాతీయ స్థాయిలో ఆదర్శంగా ఉండాలన్నారు. డేటా, సాంకేతికత ఆధారంగా క్షేత్రస్థాయి పరిస్థితులపై హెచ్చరిక వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని సూచించారు. ఆరోగ్యం, వ్యవసాయం, గనుల రవాణా వంటి అంశాల్లో పర్యవేక్షణ పెంచాలని, అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు.

--------------------------

రాష్ట్రంలో పంచాయతీరాజ్ శాఖ పనితీరును మరింత పారదర్శకంగా తీర్చిదిద్దాలని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులతో ఆయన నిన్న సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతి ప్రజలకు స్పష్టంగా తెలిసేలా ప్రత్యేక పబ్లిక్ డ్యాష్‌బోర్డ్‌ను రూపొందించాలని సూచించారు. ఘన వ్యర్థాల నిర్వహణలో భాగంగా తిరుపతి జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తున్న గ్రీన్ షాప్ విధానాన్ని రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాలని అధికారులకు సూచించారు.

--------------------------

రాష్ట్రంలోని 36 నీటిపారుదల ప్రాజెక్టులను పూర్తిచేసేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించామని ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై జరిగిన సమీక్షా వివరాలను మంత్రి నిన్న పాత్రికేయులకు వెల్లడించారు. 2027 జూన్ నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తి లక్ష్యంగా పనులు కొనసాగుతున్నాయని చెప్పారు వెలిగొండ, హంద్రీ--నీవా, వంశధార తదితర ప్రాజెక్టులకు కూడా గడువులు ఖరారు చేశామని మంత్రి తెలుపుతూ..

వాయిస్ ..30..సెకన్లు

--------------------------

ప్రజలకు అధికారులు అంకితభావంతో సేవలు అందించాలని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా సూచించారు. హైదరాబాద్‌లో శిక్షణ పొందుతున్న 44 మంది గ్రూప్-1 ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్లు లోక్ భవన్‌లో నిన్న గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, ప్రతి నిర్ణయంలో ప్రజల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా ఉండాలని సూచించారు. పదవి అనేది కేవలం అధికారం మాత్రమే కాకుండా ఒక బాధ్యత అని గుర్తుంచుకోవాలని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి, సమాజ పురోగతికి కట్టుబడి పనిచేయాలని అధికారులకు గవర్నర్ సూచించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలో 2 కోట్ల 75 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన రెండవ టౌన్ పోలీస్ స్టేషన్ నూతన భవనాన్ని హోంమంత్రి వి. అనితా, మంత్రి అనగాని సత్యప్రసాద్ తో కలిసి నిన్న ప్రారంభించారు. శ్రీకాళహస్తి ఆలయాన్ని సందర్శించే భక్తులకు పటిష్టమైన పోలీసు భద్రత కల్పిస్తున్నామని మంత్రి ఈ సందర్భంగా తెలియజేస్తూ,

వాయిస్...30.. సెకన్లు

---------------------------

దేశంలో ప్రధాన అంతర్గత భద్రతా సమస్యలైన నక్సలిజం, తీవ్రవాద రహిత సమాజాన్ని నిర్మించడమే కేంద్ర ప్రభుత్వ సంకల్పమని కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలిపారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బస్తర్ ప్రాంతం జగ్‌దల్‌పుర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వామపక్ష తీవ్రవాదంపై చేసిన పోరాటంలో విశేష సేవలు అందించిన తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్, మాజీ డీజీపీ  రాష్ట్ర భద్రతా సలహాదారు బి. శివధర్ రెడ్డి, డీజీపీ ఆపరేషన్స్ అనిల్ కుమార్, మల్కాజిగిరి కమిషనర్ సుమతితో పాటు పలువురు అధికారులను అమిత్ షా నిన్న సన్మానించారు. అనంతరం అమిత్ షా ప్రసంగిస్తూ, నక్సలిజాన్ని అణచివేయడంలో  తెలంగాణ పోలీసులు  కీలక పాత్ర పోషించారని హోంమంత్రి ప్రత్యేకంగా ప్రశంసించారు.

---------------------------

భవిష్యత్ న్యూక్లియర్ ఆర్థిక వ్యవస్థలో ఆంధ్రప్రదేశ్‌ను గ్లోబల్ భాగస్వామిగా నిలబెట్టడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. ఢిల్లీలో న్యూక్లియర్ ఎనర్జీ ఇన్‌స్టిట్యూట్, యూఎస్-ఇండియా స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్ ఫోరం సంయుక్తంగా నిర్వహించిన సదస్సులో మంత్రి నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ.. స్మాల్ మాడ్యులర్ రియాక్టర్లు, తదుపరి తరం న్యూక్లియర్ సాంకేతికతలకు భారత్‌లో విస్తృత అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఇంజనీరింగ్ ప్రతిభ, తయారీ సామర్థ్యం, పోర్టులు, లాజిస్టిక్స్ సదుపాయాలతో ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక అవకాశాలు ఉన్నాయని తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో  ఎండల తీవ్రత కొనసాగుతోందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది.  రాయలసీమ, కోస్తా జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 45 నుంచి 47 డిగ్రీల సెల్సియస్ వరకు నమోదయ్యే అవకాశముందని  తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా ఈరోజు  84 మండలాల్లో తీవ్ర వడగాలులు, 245 మండలాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది.

తెలంగాణలోనూ రానున్న మూడు రోజులు ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని, వడగాలులు కూడా వీస్తాయని  హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

=====================